క్లుప్తంగా

జాబితాలో సరిచూసుకోండి

దమ్మపేట: ఓటర్ల జాబితాను సరిచూసుకోవాలని, మండల పరిధిలోని ఓటర్లకు తహసీల్దార్ ఎండి.ముజాహిద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ముసాయిదా ఓటర్ల జాబితా, ఈ నెల 21వ తేదీన పోలింగ్ కేంద్రాల్లో ప్రచురితం అయిందని తెలిపారు. ఆ ఓటర్ల జాబితా పోలింగ్ కేంద్రాలు, బీఎల్ఓలు, తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు, సవరణల కోసం ఈ నెల 26, 27 తేదీలతో పాటుగా సెప్టెంబరు 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో, బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

రేణుకాచౌదరి పరామర్శ

చండ్రుగొండ: మండలంలోని తుంగారం గ్రామానికి చెందిన యూత్‌కాంగ్రెస్ నాయకుడు పసుపులేటి వీరబాబు కుటుంబాన్ని మాజీ కేంద్రమంత్రి రేణుకాచౌదరి గురువారం పరామర్శించారు. వీరబాబు నాయనమ్మ నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. ఆమె ఆ కుటుంబాన్ని కలిశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, టీపీసీసీ సభ్యురాలు వగ్గెల పూజ, యండి.సాబీర్ హుసేన్, ఇంజం అప్పారావు, బదుగు కృష్ణవేణి, యండి.అన్వర్ పాల్గొన్నారు.

12 క్వింటాళ్ల బియ్యం వితరణ

కరకగూడెం: మండల పరిధిలోని నర్సంపేట ఎస్సీ కాలనీ, తాటిగూడెం గ్రామాలకు చెందిన వరద బాధితులకు వారి గ్రామాల్లో 'ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్'ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యుడు షేక్ సోందుపాషా సమక్షంలో కరకగూడెం ఎస్సై రాజారాం చేతుల మీదుగా గురువారం బియ్యం వితరణగా అందించారు. సుమారు 50 కుటుంబాలకు 25 కేజీల చొప్పున 12.50 క్వింటాల బియ్యాన్ని పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యుడు షేక్ సోందుపాషా మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

కరకగూడెం: కరకగూడెం, సీతారాంపురం గ్రామాల్లో గురువారం సిబ్బందితో డెంగీ పాజిటీవ్ వచ్చిన వారి ఇళ్లలో పైరిత్రమ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. కరకగూడెం పీహెచ్సీ వైద్యాధికారి కారం మధు ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని ఇళ్లలో తిరుగుతూ గ్రామస్తులకు దోమల బారిన పడకుండా తగు సూచనలు, సలహాలిచ్చారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అలాగే దోమల లార్వా ఉన్న పాత్రలను తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఊకె రామనాథం , ఉప సర్పంచ్ రావుల రవి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ అరుణ్ బాబు, ఏఎన్ఎం పద్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరంలో ప్రతి గురువారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఓ భక్తుడు విరాళం అందజేశాడు. పట్టణానికి చెందిన మారిశెట్టి చంద్ర శేఖర్ రూ.20 వేలు ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశాడు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ కుటుంబసభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దాతను శాలువతో సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కొమ్మనపల్లి ఆదినారాయణ, కోశాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గుండాల: నేషనల్ హెల్త్ మిషన్ స్కీం లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని స్టాఫ్ నర్సులు కుంజా మాధవి, మెకాళ్ల స్వాతి డిమాండ్ చేశారు. ఈనెల 31 నుంచి చేపట్టే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక ఆస్పత్రిలో గురువారం నల్ల బ్యాడ్జీలతో విధుల్లో పాల్గొన్నారు. ఈనెల 30 వరకు నిరసన ఉంటుందని, 31 తర్వాత దశల వారిగా ఆందోళన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సమ్మెను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మడకం సత్తిబాబు, జవ్వాజి సావిత్రి, పుల్లమ్మలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం

దమ్మపేట: దురాక్రమణకు గురైన శ్మశాన వాటిక స్థలంపై, సర్వే నిర్వహించాలని కోరుతూ మండలంలోని జగ్గారం రెవెన్యూ పరిధిలోని గుర్వాయిగూడెం గ్రామస్తులు స్థానిక తహసీల్దార్ ఎండి.ముజాహిద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... పూర్వం నుంచి గ్రామ శివారులో శ్మశాన వాటికను, సరిహద్దులోని రైతు ఆక్రమించాడని అన్నారు. ఆ భూమిని సర్వే చేసి తిరిగి గ్రామానికి ఇప్పించాలని కోరారు. తహసీల్దార్‌ను కలసిన వారిలో కూరం వసంతరావు, నర్సింహారావు, మహేష్, సత్తిబాబు, గిరిబాబు పాల్గొన్నారు.

రూ.8 కోట్లతో రోడ్ల నిర్మాణం

- శంకుస్థాపన చేసిన విప్ రేగా
- నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని వెల్లడి



అశ్వాపురం: బీజీకొత్తూరులో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న విప్ రేగా కాంతారావు

అశ్వాపురం: మండలంలో గురువారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు విస్తృతంగా పర్యటించి సుమారు రూ.8.47 కోట్లతో రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. 2.25 కోట్లతో ఆనందాపురం–నెల్లిపాక, 82.50 లక్షలతో ఆర్‌అండ్‌బీ రోడ్డు– రేగా కాలనీ, 1.12 కోట్లతో తుమ్మలచెరువు–వెంకటాపురం కాలనీ, 1.50 కోట్లతో బీజీకొత్తూరు–నవోదయ స్కూల్ స్థలం వరకు, 52.50 లక్షలతో ఆర్అండ్‌బీ రోడ్డు–ఆర్అండ్‌బీ రోడ్డు గొల్లగూడెం వరకు, 45 లక్షలతో అమెర్దా–అంబేద్కర్‌నగర్, 30 లక్షలతో అశ్వాపురం–కొమ్ముగూడెం, 75 లక్షలతో ఆర్‌అండ్‌బీ రోడ్డు–మంచికంటి నగర్, 75 లక్షలతో జగ్గారం–ఊకేవారిగుంపు రహదారులకు రేగా శంకుస్థాపన చేశారు. ఈ ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమగ్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, ఎమ్మెల్యేగా పినపాక నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డీఈ రాములు, ఏఈ ప్రసాద్, తహసీల్దార్ మాధవి, జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, సర్పంచ్‌లు కోడి కృష్ణవేణి, మర్రి మల్లారెడ్డి, ఊసా జ్యోతి, సున్నం రాంబాబు, బాణోత్ శారద, బండ్ల సీతమ్మ, బండ్ల సంధ్యారాణి, మడకం సాధు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ గజ్జెల లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, కందుల కృష్ణార్జున్‌రావు, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా..

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. గురువారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజలను పలకరిస్తూ.. నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదరుగా పైలాన్ నిర్మాణం కోసం, చాకలి ఐలమ్మ నగర్‌లో అత్యాధునికమైన పద్ధతిలో దోబీ ఘాట్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆస్పత్రి అభివృద్ధిపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.4.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. మణుగూరు మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి రూ.25కోట్లు మంజూరయ్యాయని, పనులకు సంబంధించి టెండర్లకు పిలిచామని అన్నారు.

20 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించడంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించనున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోశం నరసింహారావు, మున్సిపాలిటీ కమిషనర్ ఉమామహేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ ముత్యంబాబు, అడపా అప్పారావు, వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ముద్దంగుల కృష్ణ, ఎడ్ల శ్రీనివాస్, నవీన్, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రాఘవరెడ్డి

మణుగూరురూరల్: మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో గురువారం ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవరెడ్డి విద్యార్థులకు ఓటర్ నమోదు, ఓటు ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలన్నారు. ఓటర్ హెల్ప్‌లైన్, ఎన్‌వీఎస్పీ పోర్టల్ ద్వారా కానీ, స్థానిక తహసీల్దార్ కార్యాలయం, బూత్ స్థాయి అధికారులను సంప్రదించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఫారమ్–6 పత్రాలు అందించి ఓటు నమోదు చేయించుకుందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

'మిత్ర ధర్మం మరిచిన కేసీఆర్'



సమావేశంలో మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

దుమ్ముగూడెం: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పచ్చి అవకాశవాది అని, ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీని తిరస్కరించి ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని చెరుపల్లి గ్రామంలో జరిగిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ మిత్ర ధర్మాన్ని మరిచాడని, ఆయనకు కమ్యూనిస్టుల సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో ఎవరితో పొత్తు ఉన్నా లేకున్నా సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థిలో బరిలో ఉంటాడని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కోకన్వీనర్ కారం పుల్లయ్య, మాజీ ఎంపీటీసీ కోనే బోయిన ధర్మరాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బి.రమేష్, స్థానిక సర్పంచ్ గుండి వెంకటేశ్వర్లు, నాయకులు సరియం ప్రసాద్, కోనబోయిన రామారావు, రేసు చిన్న వీరస్వామి, కుంజా లక్ష్మీ, మడకం రాజమ్మ, సున్నం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీదే గెలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

అన్నపురెడ్డిపల్లి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు సాధించి, రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని టీపీసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ తనవంతు పార్టీ గెలుపునకు సహకరిస్తానన్నారు. తనకు టికెట్ కేటాయించిన శక్తివంచన లేకుండా పని చేసి నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేస్తామని తెలిపారు. కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రుగొండ జెడ్పీటీసీ వెంకటరెడ్డి, నల్లమోతు రమణ, చెరుకూరి రవి, దోసపాటి రాంబాబు, చల్లా రమేష్, ఐనపనూరి రాంబాబు, కల్లోజి నరసింహారావు, వీరబోయిన నాగేశ్వరరావు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: ఓ స్థలం విషయంలో తల్లీకూతుళ్ల మధ్య వివాదం కొనసాగుతుండగా.. కోర్టు ఆదేశాల మేరకు కూతురిపై గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని చర్ల రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉన్న ఓ స్థలం విషయంలో తల్లి గడ్డం చిట్టెమ్మ, కూతుళ్ల నారీమణికి మధ్య వివాదాలు నడుస్తున్నాయి. ప్రభుత్వం తనకిచ్చిన భూమిని తన కూతురు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తోందని తల్లి ఫిర్యాదు మేరకు గురువారం భద్రాచలం కోర్టులో ఇరువురి వాదోపవాదనలు కొనసాగాయి. అనంతరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కూతురు నారిమణిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

రేషన్ బియ్యం పట్టివేత

అన్నపురెడ్డిపల్లి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్థానిక పోలీసులు గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఇల్లెందు, కొత్తగూడెం నుంచి ఏపీలోని కాకినాడకు అశోక్ లైలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అన్నపురెడ్డిపల్లిలోని తనిఖీల్లో పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎస్సై షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుంటిమడుగు–గుమ్మడవల్లి మధ్య అటవీ ప్రాంతంలో కొందరు కోడి పందేలు నిర్వహిసుండగా.. సమాచారం మేరకు ఎస్సై పి.శ్రీకాంత్ నేతృత్వంలో పోలీసులు తనిఖీ చేశారు. మూడు కోడి పుంజులు, రూ.7,100 నగదు, 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు.

దేశం కోసం ప్రార్థించాలి

భద్రాచలంటౌన్: దేశంలోని క్రైస్తవులు దేశాభివృద్ధికి ప్రత్యేక ప్రార్థన చేయాలని అంతర్జాతీయ ప్రసంగీకుడు డాక్టర్ పాల్సన్‌రాజు అన్నారు. పట్టణంలోని మేడివాయి యేసుక్రీస్తు సీయోను మినిస్ట్రీస్ 22వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో శాంతి నెలకొని, సంక్షేమం దిశగా పయణించాలని ఆయన ప్రార్థన చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రమీలరాణి, నవీన్ లాజరస్, హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రం తునికిబండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇస్లావత్ నరేష్ విద్యార్థులకు కాపీ రైటింగ్ పుస్తకాలతోపాటు స్టేషనరీని గురువారం అందజేశారు. సామగ్రిని అందించిన ఐటీడీఏ పీఓ, డీడీ, ఏటీడబ్ల్యూఓలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు సమ్మక్క, ఎస్ఈఆర్‌టీ ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఎండీఎం వర్కర్ నాగమణిలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

అశ్వాపురం: నెల్లిపాక గ్రామ పంచాయతీలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో గురువారం వివిధ పార్టీలకు చెందిన 25 కుటుంబాలు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. వైస్ ఎంపీపీ వీరభద్రం, నెల్లిపాక సర్పంచ్ గొర్రెముచ్చు వెంకటరమణ, ఎంపీటీసీ గాదె జయ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

మణుగూరురూరల్: విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో మణుగూరులో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు మండల, మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండల, పట్టణ కార్యదర్శి జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్‌లు మాట్లాడుతూ.. మండల, మున్సిపాలిటీ పరిధిలోని సమితిసింగారం, సుందరయ్యనగర్, దమ్మక్కపేట, కొత్త మల్లేపల్లి తదితర గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా విషజ్వరాలు ప్రబలుతున్నాయని అన్నారు. వీటి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని, ఫాగింగ్, బావుల్లో బ్లీచింగ్, క్లోరినేషన్ వంటి చర్యలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎస్‌కె.సర్వర్, మంగి వీరయ్య, శివయ్య రాములు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు సన్మానం



సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మణుగూరురూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌డేను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మణుగూరు ప్రాంత సీనియర్ సిటిజన్, వ్యాపారి బేతంచర్ల వెంకటేశ్వరరావు తండ్రి కోటయ్య, డాక్టర్ దుస్సా సమ్మయ్యలను క్లబ్ సభ్యులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాజుల పూర్ణచందర్ రావు, కార్యదర్శి మీరాహుస్సేన్, ముత్తంశెట్టి నాగేశ్వరరావు, కృష్ణమోహన్, అడబాల నాగేశ్వరరావు, కృష్ణప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులో గురువారం గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని పార్టీ నియోజకవర్గ నాయకులు ఊకె ముద్దరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ రైతు డిక్లరేషన్‌తో రైతులకు మేలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయంతో ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ టిక్కెట్ ఎవరికి ఇచ్చిన ఐక్యంగా గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ అధ్యక్షులు మందా నాగరాజు, బానోత్ మురళీకృష్ణ, కొర్సా వెంకటేశ్వర్లు, వీరారెడ్డి, బాలు, హరి తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

దుమ్ముగూడెం: ఎల్‌బీ నగర్‌లో గిరిజన మహిళ లక్ష్మీబాయిపై అకారణంగా దాడిచేసి చిత్ర హింసలకు గురిచేసిన పోలీసులను కఠినంగా శిక్షించాలని టీడీపీ మండల కన్వీనర్ కొమరం దామోదరరావు డిమాండ్ చేశారు. గురువారం గిరిజన మహిళపై పోలీసుల దాష్టీకాన్ని నిరసిస్తూ సీతానగరం సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు వ్యవస్థ, ఇటువంటి దుశ్చర్యల ప్రజల్లో నమ్మకాన్ని పోగొట్టుకుంటోందని అన్నారు. పర్ణశాల సర్పంచ్ తెల్లం వరలక్ష్మి, దేవరపల్లి సర్పంచ్ సమ్మయ్య, సాగి రామచంద్రరాజు, కొప్పిసీడు బాబూరావు, నీలంవర్మ,తెల్లం హరికృష్ణ,మిత్రా తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ ఫిల్మ్ షూటింగ్ ప్రారంభం



షార్ట్ ఫిల్మ్‌కు క్లాప్ కొడుతున్న స్థానిక నాయకులు

బూర్గంపాడు: పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన యువకులు ప్రయోగాత్మక షార్ట్ ఫిల్మ్ షూటింగ్‌ను గురువారం ప్రారంభించారు. భద్రాద్రి సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నం.04లో స్థానిక యువకులు షార్ట్‌ఫిల్మ్‌ను నిర్మిస్తున్నారు.

చింతమళ్ల నాగరాజు దర్శకత్వంలో వంశీ, జోష్ణ యాదవ్ హీరో, హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. ఈ షార్ట్ ఫిల్మ్‌కు గుమ్మడి సాయి కెమెరామెన్‌గా, లుబెక్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో జాలిలేని రాక్షసివే హీరో రఫీక్, దర్శకుడు రంజిత్, చందు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు కేటాయించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అశోక్ నగర్ కొత్త కాలనీ, కరకట్ట వద్ద ఉన్న గోదావరి ముంపు బాధితులకు వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గోదావరి వరదలు వచ్చిన ప్రతిసారి అశోక్ నగర్ కొత్త కాలనీలో కరకట్ట వద్ద నివాసం ఉంటున్న పేదల గృహాలు వరద ముంపునకు గురవుతున్నాయని, తక్షణమే వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని అన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యుడు పి.సంతోష్ కుమార్, వరద ముంపు బాధితులు బొడ్డు లక్ష్మి, షబానా, కోయిల రత్నకుమారి, బొడ్డు రాధా, చింతల నరసింహారావు, పూజారి ఆదెమ్మ, బత్తిన సత్యవతి, ప్రసాద్, విష్ణు, ఝాన్సీ పాల్గొన్నారు.

చంద్రయాన్–3లో బీపీఎస్ పూర్వ విద్యార్థి



మనోజ్‌రెడ్డి

బూర్గంపాడు: సారపాక లోని ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థి డి.మనోజ్‌రెడ్డి చంద్రయాన్–3 విజయవంతంలో తనవంతు పాత్ర పోషించాడు. ఇస్రోలో మెకానికల్ ఇంజనీర్‌గా ఆయన పనిచేస్తున్నారు. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో 42 ఏళ్లపాటు మనోజ్‌రెడ్డి తండ్రి మధుసూదన్‌రెడ్డి ఉద్యోగం చేశాడు. మనోజ్ కూడా 22 ఏళ్లు సారపాకలోనే నివశించాడు. ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్‌స్కూల్‌లో 10వ తరగతి వరకు చదువుకున్నాడు. న్యూఢిల్లీ ఐఐటీలో ఎంటెక్ చేశారు. 2019లో ఇస్రోలో మెకానికల్ ఇంజనీర్‌గా జాయిన్ అయ్యాడు. చంద్రయాన్–3లో మెకానికల్ ఇంజనీర్‌గా ఆయన పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనను స్థానికులు అభినందిస్తున్నారు.

మహ్మద్‌నగర్‌లో వైద్యశిబిరం

చండ్రుగొండ: మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామంలో చండ్రుగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో డాక్టర్ కనకం తనుజా శిబిరం ఏర్పాటు చేసి జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ శిబిరంలో హెల్త్‌సూపర్‌వైజర్ యండి.ఇమాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి వైద్యం అందించాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓబీ వెలికితీత పనులు నిర్వహిస్తున్న దుర్గా, మహాలక్ష్మి, వీపీఆర్ కంపెనీల వర్కర్లకు సింగరేణి ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు అందించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఏరియా ఎస్ఓటూ జీఎం కృష్ణయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ సెక్రటరి జనరల్ త్యాగరాజన్ మాట్లాడుతూ.. ఓబీ పనులు నిర్వహిస్తున్న వర్కర్ల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో యాజ మాన్యాలు చిన్నచూపు చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, పుచ్చకాయల శంకర్, వెలగపల్లి జాన్, నామా వెంకటేశ్వరరావు, రాజలింగు, ఉప్పన్న, ప్రశాంత్, శ్రీధర్, న గేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్–3 విజయోత్సవాలు



ములకలపల్లి: ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పాఠశాల విద్యార్థులు



దమ్మపేట: 'ఇస్రో' ఆకారంలో కూర్చున్న బాలికలు

మణుగూరురూరల్: ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్ విజయవంతం కావడంపై మణుగూరులో వ్యాపారసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు ఆధ్వర్యంలో బుధవారం విజయోత్సవాలను నిర్వహించారు.

మణుగూరు పట్టణ ప్రధాన రహదారిపై సీఐ బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, వ్యాపార వర్గాల వారు ర్యాలీ నిర్వహించారు. అలాగే మణుగూరు మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో విజయోత్సవ సంబురాలు చేసుకున్నారు.

దమ్మపేట: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా పాఠశాలలో గురువారం సంబురాలు నిర్వహించారు. ఇస్రో ఆధ్వర్యంలో, చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకుని, దమ్మపేట గ్రామంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలోని విద్యార్థులకు చంద్రయాన్–3 ప్రయోగం అవశ్యకతను వివరించారు. బాలికలను ఇస్రో ఆకారంలో కూర్చొబెట్టి, విద్యార్థులు జాతీయ జెండాలను చేత పట్టుకుని సంబురాలను నిర్వహించారు.

ములకలపల్లి: చంద్రయాన్ –3 విజయవంతం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండలకేంద్రంలోని జీవన్‌జ్యోతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకాలు చేబూని ప్రకార్డులతో, జయహో భారత్ నినాదాలు చేస్తూ పురవీధుల్లో ప్రదర్శన చేశారు. తొలుత పాఠశాలలో ఆవరణలో చంద్రయాన్–3 ఆకారంలో పిల్లలు కూర్చుని ఆనందంగా గడపారుప భారత సంసృతి ప్రతిబంబించేలా సాంసృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మణుగూరురూరల్: విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం